# నన్ను దోచుకొందువటే

వీధిలో వాళ్ళు విడ్డూర పోయారు! ఆఫీసంతా హాశ్చర్య పోయింది! బంధువులంతా నివ్వెర పోయారు! ఫ్రెండ్సేమో 'ఔరా' అని ముక్కు మీద వేలేసుకున్నారు!

గోపాలమనబడే సదరు క్యారెక్టర్‌కి అంత 'పవరు'న్నదన్న మాట. మరి గోపాలమా మజాకా! అతను పన్చేసేది కూడా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు.

ఆగండాగండి.

అసలా సకల జనుల విభిన్న నిట్టూర్పులకి నిజ కారణంబేమిటంటే-

రూపాయి ఖర్చుకి లక్ష టైమ్స్ మైండు చించుకునే పిసినారి గోపాలం... తెగించి ఇన్నాళ్ళకి ధైర్యంగా సెల్ కొనడం!

అతడు సెల్ కొనుగోలు చేసిన ఉత్తరక్షణం... ఆ కంపెనీ యమ అర్జంటుగా దివాళా తీసేసిందనుకోండి. అది వేరే విషయం.

రేట్లు తగ్గాయ్... తగ్గాయంటే...తక్కువకే కొన్నాడు. అయినా దిగులు. అదనంగా అనవసరంగా ఇదొక ఖర్చే కదా! అని.

మా కనెక్షన్‌కి మారండి... మారిపోండని...ప్రకటనల్తో తెగ ఊదర గొడ్తుంటే... పొన్లెమ్మని కొంత ఉచిత టాక్‌టైమ్ స్కీమ్‌తో వెంటనే పాపులర్ కంపెనీ 'బైబై' లోకి హుందాగా మారిపోయాడు.

ఆ సందర్భంగా టీ-బిస్కట్లంటూ ఆఫీస్ స్టాఫ్ వందకి ఆముదం రాశారు. ఇంటి దగ్గర అమ్మలక్కలంతా భార్యతో స్వీట్స్‌కి మరో వంద వదిలించారు. చిరుపార్టీ అంటూ సాయంత్రం ఫ్రెండ్స్ సరేసరి. వెరిసి ఉత్తుత్తినే అయిదొందలు రా!

హతోస్మి! తెగ గింజుకున్నాడు గోపాలం. ఆ రోజు సుఖంగా నిద్రపడితే ఒట్టు.

ఇకపోతే మనవాడికి మరో చిక్కొచ్చి పడింది. మొబైల్‌ని ఆపరేట్ చేయడం అంతగా రాదు. ఎలాగబ్బా అని బుర్ర తడుముకున్నాడు. ఇక స్వయంగా యుద్ధరంగంలోకి దిగాలని డిసైడయ్యాడు. ఎవర్నైనా కన్సల్ట్ చేద్దామంటే ఇన్సల్ట్ అన్పించింది మరి!

గతంలో సెల్ గురించి వాళ్ళూ, వీళ్ళూ చెప్పినవి... అనుకోగా విన్నవి... ఫ్లాష్‌బ్యాక్ నుండి బయటకు లాగి.... అది నొక్కి ఇది నొక్కి...నొక్కకూడనివి సైతం కంగారులో నొక్కేసి...అలిసి సొలసి చూస్తే ఏముంది?

వంద బ్యాలెన్స్ గాయబ్!

గోపాలానికి గుండెలో గుండు సూది గుచ్చినట్టయ్యింది. స్ట్రోక్ వచ్చే వయసు కాదు కాబట్టి గుండెపోటు లంగరేయలేదు.

సరే వీటన్నింటినీ పక్కన పెడితే... ఆలస్యంగానైనా గోపాలం ఓ 'సెల్' వాడయినందుకు ఇంటిల్లిపాదికి 'దీపావళి' అయ్యింది. గోపాలం గుండెనేమో 'ధామ్మ'ంటోంది.

ఓ శుభోదయ వేళ భర్త చెంత చేరిన భారతి "మీరిపుడెంత 'స్వీట్'గా ఉన్నారో?" అంటూ అకాల 'భజన' మొదలెట్టింది.

"ఇంకా 'చక్కెర' వ్యాధేం రాలేదులే!" అని తన కామెడీ పంచ్‌కి తనే గలగలా నవ్వేసాడు.

పైగా "మరి క్రీస్తుపూర్వం... అనగా మన పెళ్ళి చూపులపుడు... నేను 'ఖారా' లా ఉన్నానా?" అంటూ డబుల్ ఛలోక్తి రువ్వాడు.

"అబ్బో! అబ్బబ్బో! పెళ్ళికాని డజనుమంది ఆడపిల్లల తండ్రిలా ఎప్పుడూ దిగాలుగా ఉండే మీ ఫేసు బాపూ కార్టూన్ బొమ్మలా కామెడీలోకి మారిందోచ్!" అంటూ మురిసిపోతూ తెగ పొగిడేసిందా ఇల్లాలు.

'రసగుల్లా'లా ఉబ్బిపోయాడు గోపాలం.

"అది సరే! మరి మ్యాటరేంటీ?" భార్య వాలకం ఎరిగిన గోపాలం డైరెక్ట్‌గా అడిగేసాడు.

"ఈ రోజు సండేగా!"

"నిన్న సాటర్‌డేగా తప్పదు కాబట్టి సండేనే వస్తుంది మరి...."

"అబ్బా! ఆగండి. 'మా చీర-మీమ్యాచింగ్' ప్రోగ్రామ్ వస్తుందండీ టీ.వీ.లో! మన మొబైల్‌నిక్కడినుండి ఖంగుమని మ్రోగిస్తే అక్కడి నుండి చెంగుమని ప్రశ్నలడుగుతారు. బోల్డు ఖరీదు చేసే చీరలిస్తారు. ఉచితం కదా! ప్లీజ్... ఓసారి సెల్ ఇవ్వరూ?" గోముగా గోకింది గోపాలాన్ని.

"సర్సర్లే!"

ఉచితమంటే పాకిస్థాన్ కైనా పరుగు తీసేరకం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అపోజ్ చేయని ప్రతిపక్షంలా సైలెంటైపోయి గమ్మునిచ్చాడు మొబైల్‌ని.

భారతి సంబరంగా వెళ్ళి టీ.వీ. ముందు ఫిక్సయింది. టీ.వీ. పడని గోపాలం బయటకు తుర్రుమన్నాడు.

'మా చీర-మీ మ్యాచింగ్' ప్రోగ్రామ్ వచ్చే చానెల్ ఓపెన్ చేసి వాళ్ళ నెంబర్ కొరకై తెరమీదికి చూపుల్ని ఫోకస్ చేసింది. ఆ నెంబర్ చిక్కింది తుదకు. భారతి కూడా గోపాలానికి డిటో డిటో! కాల్ చేయడం మాత్రమే ఎరుగును. అందుకే వాళ్ళ నెంబర్ స్క్రీన్ మీద దర్శనమవడం ఆలస్యం గబగబా నొక్కేసింది సెల్.

నెంబర్ స్టోరేజ్ వగైరాలింకా తెలియని భారతి... ప్రతిసారీ తెరపైకి వీక్షించడం...కాల్ పంపడం... విసుగొచ్చిన తరుణంలో... "లవ్" రింగై ఆమె మొబైల్‌ని తట్టింది!

వంటావార్పు, తిండీ తిప్పలు, అలవాట్లు అభిరుచులు వగైరా 'చెత్తబుట్ట కబుర్లన్నీ' అడిగి ఆరా తీసి సాగతీసింది యాంకరమ్మ. (బిల్లు పడేది వారిక్కాదుగా)

ఎగ్జామ్ పేపర్ రాసిన మరుక్షణం నుండే రిజల్ట్స్ కోసం ఆబగా ఎదురు చూసిన స్టూడెంట్‌లా భారతి ఎగ్జయిట్ మెంట్‌కి లోనయ్యింది. ఏ చీర నా దరి చేరునోకదా! అని ఊహాలోకాల్లో తేలియాడింది.

"బీరెడీ! సింపుల్ క్వశ్చన్. కరెక్ట్ సమాధానమిస్తే 'మీ చీర మాకే'! ఛ..ఛ! మా చీర మీకే!" అంది యాంకరమ్మ ఓవరాక్షన్ చేస్తూ.

'అడగండడగండి" తెగ ఉబలాట పడి పోతోంది భారతి.

"మీరిందాక' ఫోన్ చేసిన మా నెంబర్‌ని ఆగకుండా గబగబా అప్ప చెప్పగలరా?"

గతుక్కుమంది భారతి. కంఠంతారాదు. తెరపైకి బిక్కమొగమేసి కంగారుగా చూసింది. ఆ టైముకి స్క్రీన్‌పై నెంబర్ లేదు. మటుమాయం! ఏం చేసేది?

తుస్ తుస్...!ఢాం ఢాం...!!

యాంకరమ్మ సెలవిచ్చిన గడువు హుష్‌కాకి!

"నాకు డౌటొచ్చే ఈ క్వశ్చన్ అడిగా, ఎనీహౌ... నెవర్ బ్యాడ్! మరో సారి 'ట్రై' చేయండి. ఇంట్లో 'ఫ్రై' కాదు. బెస్టాఫ్ లక్!" యాంకరమ్మ నవ్వుతో గిల్లుతుంటే ఫోన్ డిస్ కనెక్ట్ చేసింది.

చీర చిక్కక పోయినా భారతి బానే ఉంది బ్యాలెన్స్‌డ్‌గా.

ప్చ్! తీరగ్గా వచ్చి సెల్ బ్యాలెన్స్ చెక్ చేసుకున్న గోపాలం గుండెలో రాయి "బ్లాస్ట"య్యింది. మనిషి "రోస్ట్" అయ్యాడు.

యాంకరమ్మ బాతాఖానీ దురదకి 'ఫుల్' గా ఉన్న బ్యాలెన్స్ కాస్తా 'నిల్' అయ్యింది.

❋ ❋ ❋

"మొబైల్ ఎక్కడున్నాదీ... మీ మొబైల్ ఎక్కడున్నాదీ..." కుదరక పోయినా కర్ణకఠోరంగా పాటెత్తుకుంటూ పరుగు పరుగున ఊడిపడ్డాడు పక్కింటి శ్రీపాదం.

"అది నా జేబులోనే ఉన్నాదీ..." శృతి కలిపిన గోపాలం చప్పున ఆపి నాలిక్కరుచుకున్నాడు" తనకీ జబ్బేంటని? పాడు బుద్దేంటని?

"గోపాలం గారూ! ఓ సారి మీ బుజ్జి సెల్ ఇస్తారా?" డైరెక్ట్‌గా ఎటాక్ చేశాడు.

"ఇవ్వను. ఇవ్వను గాక ఇవ్వను!"

"ఆపను. పాడడం ఆపను గాక ఆపను. తర్వాతేం జరిగినా మీదే బాధ్యత." బెదిరించాడు.

"హవ్వ! సెల్ కూడా చేబదులు అడుగుతారా! ఇదేం వింత? ఇదేమి చోద్యం?" కళ్ళు మిటకరించి "సెల్లు నాకంటే ముందే మీకుందిగా?" అంటూ బుంగమూతి పెట్టాడు.

"మా పెద్దబ్బాయి తీస్కెళ్ళాడు. దగ్గరున్న కిరాణాకొట్టులో కాయిన్‌బాక్స్ అవుటాఫ్ ఆర్డరుట. నాకేమో అర్జంట్. యమ టెన్షన్‌గా ఉంది." అంటూ తొందరపెట్టాడు.

"కుదర్దు" మొహమాటం లేకుండా కరాఖండిగా చెప్పేసాడు.

"మరి నేనో పాటేస్కొంటా!" హైజాకింగ్, బ్లాక్‌మెయిల్ వగైరాలన్నీ మిక్స్ చేసి ప్రయోగించాడు శ్రీపాదం.

గోపాలం అస్సలు తగ్గలేదు.

"అలాగైతే నే వాంతి చేస్కుంటా!" అంటూ కోరసయ్యాడు.

డిమాండ్ వన్ పర్సెంటేజ్ కూడా దిగలేదు.

వాస్తవానికి శ్రీపాదానిది మామూలు వాయిస్ కాదు. గర గర కంఠుడు. గొంతు విప్పాడంటే ముప్పే! బుర్ర నొప్పే! రోజంతా తలనొప్పే!

"ఇదెక్కడి శాపంరా బాబూ! సెల్లివ్వనంటే సిల్లీగా పాడతానంటాడే?" విసుక్కున్నాడు గోపాలం అరచేత్తో నుదురు చరుచుకుంటూ.

ఇంతకీ శ్రీపాదం ఘనత ఏపాటిదంటే... ఉన్న పళంగా పేరడీ కట్టేస్తాడు! తన పైత్యం కక్కేస్తాడు. బతికుండగానే పాడె ఎక్కిస్తాడు! ఆసాంతం వినేవాడి తాట ఒలిచేస్తాడు!

'కడవెత్తు కొచ్చిందీ కన్నెపిల్లా...' అనే ఓల్డ్ క్లాసిక్‌ని 'కుక్కెత్తు కొచ్చిందీ మక్కెకున్నా...' గా ట్యూన్ చేసి చంపేస్తాడు.

'నిన్నే...నిన్నే...' లేటెస్ట్ హిట్‌ని 'తన్నే...తన్నే...కాల్తో తన్నే..' గా మార్చేసి గుండె చీల్చేస్తాడు.

ఏ జన్మలో చేసిన ఘోర పాపమో! ఈ జన్మలో వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నాడు. పక్కింట్లోకి శనిలా దాపురించాడు. తిట్టుకున్నాడు గోపాలం.

జిడ్డు వదిలిపెట్టడని "ప్లీజ్! రెండంటే...మరి రెండే కాల్స్ చేసుకోవాలి. అసలే నాది వీకెస్ట్ బడ్జెట్..." రివర్స్ గేర్‌లో తనే ప్రాధేయపడుతూ సెల్ శ్రీపాదానికి సమర్పించాడు గోపాలం...గోవిందాయనమః అని తెలిసి.

"అలాగలాగే!" ఫోజెట్టి వరమిచ్చాడు శ్రీపాదం.

తన కోర్టులోకి వచ్చిన బంతి. తనిష్టం. తాపీగా హాపీగా మాట్లాడసాగాడు.

కుతకుతలాడి పోతోంది గోపాలానికి. పట్టించుకోలేదు శ్రీపాదం.

శ్రీపాదం బంకలా సెల్‌ని వదలకుండా మాట్లాడ్తున్న మ్యాటర్ బయటకు లీకై గోపాలం ఘొల్లుమన్నాడు.

శ్రీపాదం ఇంట్లో కరెంటు లేదుట (వీధిలోనే లేదు) కరెంటాఫీసులో పన్చేసే గోపాలం ఇంట్లో కరెంటుందని వచ్చాట్ట. మరి సెల్‌లో మాట్లాడుతున్న మ్యాటరేంటంటే... క్రికెట్ మ్యాచ్ గురించి వివరాలడుగుతున్నాడెవరినో...గంటల ముల్లు కదులుతున్నంత స్లోమోషన్‌లో! మరి బ్యాలెన్సేమో సెకన్ల ముల్లులా రన్నింగ్ చేస్తోంది!

లబలబ లాడాడు గోపాలం. నెత్తీ నోరు బాదుకున్నాడు.

గోపాలం యాక్షన్ చూశాక రియాక్టయిన శ్రీపాదం జాలిపడి అతడి సెల్ అతడికి తిరిగిచ్చేసి దర్జాగా వెళ్ళిపోయాడు.

శ్రీపాదం వెళ్ళాక చూసుకుంటే రెండే రెండు కాల్స్ అని చెప్పినవాడు పదిహేను కాల్స్ తగలెట్టాడు. చెప్పనే లేదు. గోపాలం వేయించుకుంది లైఫ్ కార్డ్. నిమిషానికి కాల్‌కి రెండు రూపాయల చొప్పున ముప్పై గోవిందా.. గోవింద!

"ఊహించని అతిథి వస్తాడని" గంట కొట్టి మరీ చెప్పిన 'వారఫలాలు' గోపాలం కంటి జలాలయ్యాయి. బిగ్గరగా ఏడుపొక్కటే తక్కువైందిక!

* * *

"నాన్నా! నాకోసారి సెల్ ఇవ్వు" చెంగు చెంగున పరుగెత్తుకొచ్చిన జూనియర్ గోపాలం ఆర్డరేసాడు సీనియర్ గోపాలాన్ని.

"వన్ రూపీ కాయినిస్తా. బయట చేసుకో!"

"షేమ్! షేమ్! ఇంట్లో సెల్లుండీ కాయిన్ బాక్స్ ఎందుకని శ్రీపాదం అంకుల్ వాళ్ళ బుజ్జి దెప్పుతోంది." అంటూ తండ్రికి కౌంటరేసాడు.

గోపాలం గొంతు పాలమారింది.

"ఆర్నీ! సెల్ విషయంలోనూ టీచింగ్ లేనా! పైగా అమ్మాయిలు అబ్బాయిల్నా? మరేమో దాని బాబుకైతే పక్కింటోడి సెల్ కావాలి. హు!" తిట్టిపోసాడు.

పైగా కొడుకుని అనుమానంగా చూసాడు గోపాలం.

ఆ చూపులు పసిగట్టిన జూనియర్ "నేను టెంతిపుడు. నాకిపుడే ప్యార్‌కా కహానీ లాంటివేం లేవుగానీ...సొల్లాపి సెల్లివ్వండి."

'ఇదెక్కడి గొడవరా బాబూ!'

అరచేత్తో బట్టగుండు తడుముకుంటూ-

"ఇంతకీ తమరికి సెల్లెందుకో సెలవిచ్చి చచ్చారుకాదు." వాయిస్ తగ్గించి జూనియర్ వంక గుర్రుగా చూసాడు.

'అలా దారికి రా నాన్నా! అన్నట్టు ప్రహ్లాదుడిలా ఓ నవ్వు నవ్వాడు.

"టట్టడాం" చానెల్ వాళ్ల 'ఆంధ్రా జీకే- వన్ లాక్ మీకే!' జూనియర్ కాంటెస్ట్‌లో ఓకే అవుదామని."

"లక్ష నీకేనంటావా? వెటకారంగా అడిగాడు.

"వస్తే లాక్కోరూ?" దెప్పి పొడిచాడు.

"తమరిది మట్టి బుర్రేగా!" వెక్కిరించాడు తండ్రి.

"మీ నుండి వారసత్వంగా సంక్రమించిందేగా." తండ్రికే నిప్పంటించాడు.

చుర చుర మంది గోపాలానికి. కొరకొరా చూసాడు కొడుకు వంక.

సెల్ ఇవ్వక పోతే మాటల్తో చంపేట్టున్నాడని...

"మాటలు నేర్చావు వెధవాయ్!" ఉడుక్కున్నాడు సెల్ అందిస్తూ.

'టట్టడాం' చానెల్ వాళ్ళు గంటసేపు సాగ దీసిన వెర్రి మొర్రి ప్రశ్నలకు జవాబులు రాక నీళ్ళు నమిలిన జూనియర్, వేడెక్కిన బుర్రతో బిక్కుబిక్కుమంటూ వెళ్ళి సెల్ తండ్రికి అప్పగించాడు.

షరా మామూలే!

సెల్ కొన్నందుకి తగిన శాస్తి జరిగిందని బేర్‌ర్‌మన్నాడు గోపాలం.

☀ ☀ ☀

ప్రతినెలా సోది కబుర్లుకి, సొల్లు కాల్స్‌కి సెల్ బిల్ ఘాటుగా తగులుతుండడంతో డంగైన గోపాలం గింగిరాలు తిరిగి పోయాడు.

పెనం మీద పేలాల్లా చిటపట లాడి పోయాడు.

ఆఫీసులోనూ, ఫ్రెండ్స్ దగ్గరా ఇదేతంతు...

"నీకొత్త సెల్ ఓసారావ్వవూ?" అని ఒకరు.

"నాకు లేదనా నిన్నడగడం" అంటూ మరొకరు.

"ఒక్క కాల్‌కే నీ సొమ్మేం తరగదులే." అంటూ ఇంకొకరు.

ఎవర్ని అని ఏం లాభం!

అభిమన్యుని మరణానికి కారకులు అందరైనట్లు...పరిచయం ఉన్న ప్రతి ఒక్కరు గోపాలం సెల్‌తో ఆడుకుంటున్న వాళ్ళే.

"సమయాన్నీ... నా జీవితాన్నీ...తెగ దోచేస్తున్న సెల్లూ...నీకోదండం! అనుకొని తుదకో స్ట్రాంగ్ నిర్ణయానికొచ్చేసాడు".

ఫలితంగా-

అందరికీ తెలియపరిచినట్టుంటుందని గోపాలం ఇంటి గుమ్మానికి వేలాడుతూ ఓ ఫ్లెక్సీ దర్శనమిచ్చింది.

దానిలో అక్షరాలిలా ఉన్నాయి.

'నా దగ్గర అమ్మకానికో మొబైల్ ఉంది. మీకు తోచినంత నాకిచ్చేసి వీలైనంత తొందరగా దీన్ని నానుండి దూరం చేయవలసినదిగా విజ్ఞులందరికీ ఇదే నా మనవి.'

సెల్ పాయింట్ వాళ్ళకూడా ఈ కబురందించాడు!

**(20.04.2008)**

❖